# ఆఫీసర్ బాబు

**డా॥ గుమ్మనూరు రమేష్ బాబు.**

జీపు ఆగిన శబ్దం విని ఎండుపుల్లలు ఏరుకొంటున్న మాలచ్చిమి తలెత్తి చూచింది. తననే తీక్షగా చూస్తున్న ఆఫీసరు బాబుని చూచి ముఖం చిట్లించుకొంది. ఎందుకు ఆగినట్లు? అర్థం కాలేదు మాలచ్చిమికి.

ఆఫీసర్ బాబు కళ్ళకి మాలచ్చిమి అందంగా కనిపించింది. ఆకర్షణీయంగా ఆరోగ్యంగా ఉన్న మాలచ్చిమిని చూస్తుంటే ఆఫీసర్ బాబుకి ఏమిటో గుర్తు కొచ్చింది. గుచ్చి గుచ్చి తననే చూస్తుంటే మాలచ్చిమికి మాచెడ్డ చిరాకేసింది.

"ఏంటి బాబుగోరూ! ఏం కావాలా?" అంది విసుగ్గా.

ఆ మాట తీరు, పెడసరంగా అలా సమాధానం చెప్పే పద్ధతి ఆఫీసర్ బాబుకి మరింత ఆసక్తిని కలిగించింది.

"ఏమీలేదు! నా జీపులో వస్తావా? మా ఇంటికి పిలుచుకొని వెళతాను. మళ్ళీ వచ్చేద్దువుకాని! జీపులో తీసుకొచ్చి నేనే దిగబెడతాను. సరేనా! అన్నాడు ఆఫీసర్ బాబు.

గుండె 'గుభేలుమంది మాలచ్చిమికి!

సాయమ్మ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి...

"ఒసేయ్ మాలచ్మీ! రాచకోనవద్ద ఏం జరిగిందో తెలుసా? రంగసాని అని నా యీడుదే! మా ముచ్చటగా ఉంటుందిలే! జింక పిల్లకి మల్లే చెంగు చెంగుమని కోనంతా తిరుగుతూ ఉండేది. ఎన్నలాంటి మనసు! ఎన్నెల్లా దాని సొగసు! అంత అందమైంది అంతకి ముందు ఆ కోనలోనే లేదనుకో! అయితే ఏంపాపం"

తాను ఆశ్చర్యపోతూ అడిగింది. "ఏమైంది రంగసానికి?" అని!

"ఏముందే తల్లీ! దాని అందం చందం ఎవడో ఎల్ఫేరు ఆపీసరట! చూచాడు. అంతే! దాని మీద కన్నేసాడు ఓరోజు అది కట్టెలేరుకొంటూ ఉంటే జీపులో వచ్చి ఆగాడు. మాయమాటలు చెప్పాడు. అది నమ్మింది. ఆ మాయదారి సచ్చినోడి బుట్టలో పడిపోయింది. జీపెక్కి చక్కగా వాడితోటి వెళ్ళింది. 'నీకు జింక పిల్లలంటే ఇష్టంకదా!' అంటూ దాన్ని గదిలోకి లాక్కెళ్ళాడు. ఆ తరువాతేముంది....నాకు సెప్పడానికి నోరు రావడం లేదే తల్లి!"...

సాయమ్మ ఆ తరువాత ఏం జరిగిందో చెప్పకపోయినా మాలచ్చిమికి మాత్రం ఆ దృశ్యం కళ్ళెదుటే కనిపించింది.

పద్దెనిమిదేళ్ళ పడుచుతనం మయిల పడిపోయింది!

నవ వసంత పారిజాతం మురికిగుంట పాలయిపోయింది!

రంగసాని ప్రాణంకాదు .... అంతకన్నా ఎక్కువైన శీలమే పోయింది.

చెడిన దానిగా రంగసాని బతకలేదు.

చెరచబడ్డదాన్ని గిరికులం వెలి వేయకుండా ఉండదు.

అందుకే ఆమె పంచభూతాల్లో కలిసిపోయింది.

అనంతంలో ఎవరికీ అందకుండా ఎటో వెళ్ళిపోయింది.

మాలచ్చిమి ఆలోచిస్తోంది....

"ఈ వెధవ సచ్చినోడు కూడా అలాంటివాడే. ఏకంగా నన్ను ఇంటికే పిలుస్తున్నాడు. సదువు రానివోళ్ళమని, ఎంత తక్కువ సూపు! వాళ్ళ అక్కసెల్లెళ్ళు, భార్యాబిడ్డలు సల్లగుండాలా? మా బతుకులు ఏటిపాలు కావాలా? ఈ ఏళ వీణ్ణి వదలను. నా ఒంటిపైన సెయ్యి వేసాడో వాడి గుండెపైన బాకు దిగే ఉంటాది. అసలు ఇలాంటి రాకాసులకు తద్దినం పెడితేనే ఆ దైవమైనా మెచ్చుకోలుగా సూస్తాడు..."

"ఏమిటే పిల్లా! ఎంతసేపు ఆలోచన. ఇంతకీ వస్తావా? రావా? రానంటే చెప్పు. నా దారిన నే పోతా. ఎంతసేపని నిలవను. కాళ్ళు నొప్పెడుతున్నాయి. నేనిక్కడ నిలబడే ఉన్నాను. ఏమిటి నీ ఆలోచనలు! ఆఫీసరుబాబు విసుక్కున్నాడు!

మాలచ్చిమి గబుక్కున అంది.

"లేదులే ఆపీసరు బాబూ! తప్పైపోనాది. పద వస్తాను. ఏకంగా ఇంటికేగా"

ఆ అనడంలో వ్యంగ్యం ధ్వనించింది ఆపీసుర్ బాబుకి. అయినా పట్టించుకోలేదు.

"సరే! జీపెక్కు!" అన్నాడు.

మాలచ్చిమి జీపెక్కి కూర్చొంది. బొడ్లో దోపుకొన్న చురకత్తిని తడిమి చూచుకొంది. "ఆపీసరు బాబు పని ఈ యాల్టితో సరి!" అనుకొంది. "ఇలాంటి దౌర్భాగ్యులకి అదే సరైన సిచ్చ" అనుకొంటూ ఏం జరుగుతుందో, ఎలా మసలుకోవాలో ఆలోచిస్తూ కూర్చొంది.

అయితే ఆఫీసర్ బాబు ఆలోచనలన్నీ గతం చుట్టూ తిరుగుతున్నాయి. పదిహేను నిమిషాల్లో జీపు ఆఫీసర్ బాబు ఇంటి ముందు ఆగింది. జీపుదిగి లోపలికెళ్ళారు. ఇద్దరూ!

"ఇదో! నీవిక్కడే కుర్చీలో కూర్చో నేను లోపలికి వెళ్ళివస్తాను" అన్నాడు ఆపీసర్ బాబు ఎంతో సౌమ్యంగా!

"మేకవన్నెపులి కాబోలు!" అనుకొంది మాలచ్చిమి. అలాగే కూర్చొంది.

అయిదు నిమిషాలయ్యాయి. ఆఫీసర్ బాబు వచ్చాడు. చేతిలో పళ్లెం! దాంట్లో పట్టుచీర, రవికగుడ్డ, తాంబూలం, పళ్లూ ఉన్నాయి.

"చూడుపిల్లా! నువ్వు చనిపోయిన నా చెల్లి పద్మలాగే ఉన్నావు. ఈవేళ దాని పుట్టినరోజు. ఎవరికి ఈ ఆడపడచు లాంఛనం చేయాలా అని ఆలోచిస్తున్న నాకు నీవు కనిపించావు, తీసుకోమ్మా! నిండు నూరేళ్ళు బ్రతకాలని ఆ దేవుణ్ణి కోరుకొంటాను!".

ఆఫీసర్ బాబు మాటల్లోని ఆర్ద్రతకి కరిగిపోయింది మాలచ్చిమి. కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. "అన్నా!" అంటూ కాళ్ళను పట్టుకొంది.

"మగాళ్ళలో రాచ్చసులే కాదు మానుబావులు కూడా ఉంటారు!" మాలచ్చిమి మనస్సు హెచ్చరిస్తోంది. ❋